క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సామేల్


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధికి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం వినతిపత్రం అందజేశారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో కోర్టు మంజూరు చేయాలని, తుంగతుర్తిలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని, తుంగతుర్తి, అడ్డగూడూరు మండలాల్లో ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలని, తిరుమలగిరి, మోత్కూరు మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, నియోజకవర్గంలో చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయాలని వినతిలో కోరినట్లు తెలిపారు.

నాగారం ఎస్‌ఐగా ఐలయ్య



నాగారం : మండల నూతన ఎస్‌ఐగా ఎం.ఐలయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. నాగారం ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.వెంకట్‌రెడ్డి ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సీసీఎస్ నల్లగొండలో పనిచేస్తున్న ఐలయ్య ఎస్‌ఐగా నియమితులయ్యారు.

గ్రామపంచాయతీని ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మార్చాలి

అర్వపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీని ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మార్చాలని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి రెంటాల కరుణకుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఇప్పటికే మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలుకు విన్నవించినట్లు తెలిపారు. సమావేశంలో సంగెం సోమయ్య, అబ్రహం వినోద, విమలమ్మ, పగిడిమర్రి శేఖర్, యల్లయ్య, ప్రకాష్, ప్రవీణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

బస్ డిపో ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని స్థానికంగా అఖిలపక్షం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట, జనగామ, తొర్రూరు, మోత్కూరు ప్రధాన పట్టణాలకు మధ్య కేంద్రంగా తిరుమలగిరి ఉందన్నారు. బస్ డిపో నిర్మాణం కోసం త్వరలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, మూల అశోక్‌రెడ్డి, కందుకూరి సోమయ్య, వేల్పుల లింగయ్య, మేడబోయిన యాదగిరి, సత్యనారాయణరెడ్డి, పాష, కందుకూరి ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కేంద్రం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఏఐకేఎస్ పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ రైతు కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందాల కృష్ణారెడ్డి, తొట్ల అచ్చయ్య, సామ వెంకట్‌రెడ్డి, అనంతుల రాఘవులు, పంతం వెంకన్న, అలీపురం శ్రీనివాస్‌రెడ్డి, పంతం సురేష్, ఇరుగు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి

సూర్యాపేట : వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కంచుగట్ల నర్సింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే విధంగా హెచ్‌ఆర్‌ఏ, సీఏలను వర్తింపజేయాలని కోరారు. నేరుగా మార్కెట్ కార్యాలయం నుంచి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా మార్కెట్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకన్న, సైదులు, శ్రీనివాస్, చంద్రశేఖర్, విజయ్, హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

జీపీలకు పక్కా భవనాలు కరువు

- అద్దె, శిథిల భవనాల్లో పంచాయతీ పాలన
- నిధులు రాక స్లాబ్ దశలో నిలిచిన పలు భవన నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, సిబ్బంది



వేల్పుచెర్లలో అద్దె భవనంలో నడుస్తున్న పంచాయతీ కార్యాలయం


రామన్నగూడెంలో స్లాబ్ దశలో నిలిచిన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు

అర్వపల్లి : గ్రామానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పాలవుతున్నారు. కొన్నిచోట్ల పంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాలలో నడుస్తుండగా మరికొన్ని చోట్ల గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా చేపడుతున్న పనులకు నిధుల కొరతతో బడ్జెట్ సకాలంలో విడుదల కాక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో 17గ్రామపంచాయతీలు ఉండగా 11పంచాయతీలకు సొంత భవనాలున్నాయి. అందులో రెండు పంచాయతీ భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. కాగా మరో 6గ్రామపంచాయతీ కార్యాలయాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఇందులో మూడు పంచాయతీలకు భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో అప్పట్లోనే సర్పంచ్‌లు పనులు ప్రారంభించారు. కాని భవనాల నిర్మాణాలకు ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో కొన్ని భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోగా మరికొన్ని గ్రామాల్లో నిధులు సకాలంలో రావనే కారణంతో పనులు ప్రారంభించలేదు.

అసంపూర్తిగా భవనాల పనులు..

మండలంలోని బొల్లంపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో పంచాయతీకి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కాగా ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు స్లాబ్ దశ వరకు పనులు చేపట్టి నిధుల కొరతతో మధ్యలోనే వదిలేశారు. అలాగే ఉయ్యాలవాడ సూర్యానాయక్‌తండా, కుంచమర్తి గ్రామాలకు కూడా పంచాయతీ భవనాల నిర్మాణం కోసం మూడేళ్ల కిందట నిధులు మంజూరు కాగా ఇంత వరకు పనులు మొదలు కాలేదు. కాగా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో 50ఏళ్ల కిందట నిర్మించిన భవనం పూర్తిగా శిథిలమైంది. కానీ తప్పని పరిస్థితుల్లో అందులోనే గ్రామపంచాయతీని నిర్వహిస్తున్నారు. కుంచమర్తిలో కూడా భవనం శిథిలావస్థకు చేరింది. 6గ్రామాలలో పంచాయతీ కార్యాలయాలను అద్దె భవనాలలో నడుస్తుండగా వాటికి నెలనెలా అద్దె చెల్లించడం ఇబ్బందిగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాల పనులు పూర్తి చేయించి, నిధులు మంజూరైన గ్రామాలలో వెంటనే పనులు ప్రారంభించి, అద్దె భవనాలలో ఉన్న వాటికి సొంత భవనాలు నిర్మించి, సొంత భవనాలు ఉన్న చోట తగు వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం



రామన్నగూడెం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.25లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో తాను సర్పంచ్ ఉన్న సమయంలో పనులు ప్రారంభించాను. స్లాబ్ వరకు నిర్మాణం చేపట్టాం. నాకు ఇంకా రూ.9లక్షలు బిల్లు రావాల్సి ఉంది. నిధులు సకాలంలో విడుదల కాక పనులు మధ్యలోనే వదిలేయాల్సివచ్చింది.

– రమావత్ పీరమ్మ, మాజీ సర్పంచ్ రామన్నగూడెం

శిథిల భవనంలోనే నిర్వహణ



జాజిరెడ్డిగూడెంలో 50ఏళ్ల కింద నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలమైంది. కొత్త భవన నిర్మాణం కోసం ఎప్పటి నుంచో ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఇప్పటికీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. కొత్త భవనానికి వెంటనే నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం శిథిలమైన భవనంలోనే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

– బింగి కృష్ణమూర్తి, జాజిరెడ్డిగూడెం

ఉపాధ్యాయురాలు వర్దెల్లి పద్మలీలకు సన్మానం


వర్దెల్లి పద్మలీలకు జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయుల బృందం

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని టేకుమట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వర్దెల్లి పద్మలీలను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దైద పాపయ్య మాట్లాడారు. పద్మలీల 39సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం పాఠశాలలో ఆమెతో పాటు పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు మల్లేష్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామలింగారెడ్డి, గెజిటెడ్ హెచ్‌ఎంలు విజయలక్ష్మి, శోభాభాయ్‌తో పాటు ఉపాధ్యాయులు పద్మలీలతో ఉన్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. అనంతరం పద్మలీలనాగేశ్వర్‌గౌడ్ దంపతులను పూలమాలలు, మెమోంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్యానాయక్, ఉపేందర్, కిరణ్, కోటిరెడ్డి, అరుంధతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడం పట్ల రైతులు, రైతు కూలీల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని రైతు పొలంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు కొండగడుపుల నవీన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కేసీఆర్ మాటలతో కోటలు కట్టి రైతులను, నిరుద్యోగులను మభ్యపెట్టి దశాబ్ద కాలం అధికారం చేపట్టి మోసం చేశారని అన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూశారని అన్నారు. కార్యక్రమంలో రైతులు కొండగడుపుల ఎల్లయ్య, బొంకూరి భిక్షం, బొంకూరి సోమయ్య, నాయకులు మల్లెపాక సుమన్, బొంకూరి రంజిత్, మరికంటి అశోక్, రైతు కూలీలు తడకమల్ల నరసమ్మ, తడకమల్ల సంధ్య, బొంకూరి జయమ్మ, పద్మ, అనిత, సుజాత, సునీత, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

దళితులు చదువుతో చైతన్యవంతులు కావాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : దళితులు చదువును ఆయుధంగా చేసుకొని చైతన్యవంతులు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 16వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ సలిగంటి సరితవీరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మనుషులంతా ఒక్కటే అనే భావన ప్రతిఒక్కరిలో ఉండాలని, అలా ఉంటే సమాజంలో ఎవరి పట్ల ఎలాంటి వివక్ష ఉండదన్నారు. నిమ్న జాతుల్లో పుట్టి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న అంబేద్కర్ జాతికి గొప్ప సందేశాన్ని అందించాలని రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అందించారని, ఎన్నో గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య, ఆహారాన్ని అందించారని గుర్తుచేశారు. కులాలను మనమే నిర్మించుకున్నామని, మనుషులంతా ఒక్కటే అనే భావన ఉంటే ఎలాంటి వివక్ష ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ ఇందిరా, మానస, మెప్మా సీఈఓ ఉమా, వార్డు ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, నాయకులు హనుమంతు, రవీందర్, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


కంటి వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, లయన్స్ క్లబ్ చైర్మన్ దోసపాటి గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సతీమణి దివంగత వరూధినిదేవి జయంతిని పురస్కరించుకొని సూర్యాపేట లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరాలు పేదవర్గాలకు వరంలాంటివన్నారు. పేద వారికి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో కంటి శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని 29గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రంలో మెగా కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. సమాజంలో సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 170మందికి కంటి పరీక్షలు నిర్వహించి 37మందిని కంటి శస్త్రచికిత్స కోసం కంటి ఆసుపత్రి జమ్మిగడ్డకు రెఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దామోదర్‌రెడ్డి తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ఉప్పల రాజేంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ వైస్ చైర్మన్‌లు బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల వెంకట్‌రెడ్డి, కోశాధికారి చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆరె సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

సూర్యాపేట : రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థిని పన్నాల మహాలక్ష్మికి రూ.50వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను బుధవారం స్థానిక వైట్‌హౌజ్‌లో ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుపేద రెడ్డి విద్యార్థులకు వారి చదువులకు ఉపయోగపడేలా చేయూత నివ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోదాల రంగారెడ్డి, సెక్రటరీ చిలుముల సునీల్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, దండ వెంకట్‌రెడ్డి, నూకల రవీందర్‌రెడ్డి, కొండేటి విజయపాల్‌రెడ్డి, గుత్తా సోమిరెడ్డి, సూరం అనిల్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరామ్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని 14వవార్డు స్నేహనగర్‌కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం స్థానికంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మున్సిపాలిటీలోని వార్డులను విస్మరించిందన్నారు. వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందిపడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. 14వ వార్డులో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు లాలయ్య, వీరన్న, గౌస్ బాయ్, విఠల్, చంద్రారెడ్డి, లింగయ్య, నరసింహ, మల్లయ్య, సాలయ్య, చారి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

తుంగతుర్తి : ప్రతిఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. మహిళలపై ఆకతాయిలు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా వెంటనే షీ టీం, పోలీసులకు 100కాల్‌తో సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే మీరు ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్లు తెలియజేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఏడుకొండలు, షీటీమ్ ఎస్‌ఐ నీలిమ, ఎల్లారెడ్డి, వెంకన్న, గోపి, రవి, మౌనిక, శృతి, హెచ్‌ఎం సంధ్యారాణి, విద్యార్థులు ఉన్నారు.

శివాలయాలను ఒకే రిజిస్ట్రేషన్ చేయాలని వినతి


మహేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సూర్యాపేట రూరల్ : పట్టణ పరిధిలోని కాకతీయుల కాలం నాటి పిల్లలమర్రి చారిత్రక శివాలయాలను ఒకే రిజిస్ట్రేషన్ చేయాలని సూర్యాపేట మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్‌కు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేవాలయాల నిర్మాణం నాటి నుంచి నామేశ్వరాలయం, ఎరకేశ్వరాలయం, త్రికుటేశ్వరాలయంలో ఉత్సవాలు కలిపి నిర్వహిస్తున్నామన్నారు. వేర్వేరు రిజిస్ట్రేషన్‌లతో ఉత్సవాలకు ఇబ్బందులతో పాటు గ్రామంలో వర్గ విబేధాలు మొదలయ్యే అవకాశం ఉందన్నారు. మహాదేవ నామేశ్వర స్వామి దేవాలయాలు పేరుతో ఒకటే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ముందుగా ఏసీ మహేంద్రకుమార్ పదవీ విరమణ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాదక్, బంగారి శ్రీనివాస్, రాపర్తి మహేష్, కోడి నాగరాజు, చింత సైదులు, చెరుకుపల్లి రమేష్, బుచ్చిరాములు, వల్లా రోహిత్, చింత నవీన్, సట్టు సాయి, అర్చకులు సంతోష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

లింగన్న ఆశయ సాధనకు పోరాడుదాం


భానుపురి (సూర్యాపేట) : లింగన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పీడిత ప్రజల పెన్నిధి పేద ప్రజల గుండెచప్పుడు పూనెం లింగన్న అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో లింగన్న వర్ధంతిని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కన్వీనర్ నరసయ్య, నాయకులు చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, లింగన్న, వాజీదు పాల్గొన్నారు.

భానుపురి (సూర్యాపేట) : పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన లింగన్న ఆశయ సాధనకు పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లింగన్న ఐదోవర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శులు కుసుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, నాయకులు దండి ప్రవీణ్, అశోక్‌రెడ్డి, మండడి శ్రీధర్, శశిధర్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ప్రతిఘటనోద్యమ దళపతి, న్యూడెమోక్రసీ భద్రాది కొత్తగూడెం జిల్లా మాజీ కార్యదర్శి పూనెం లింగన్న ఐదో వర్ధంతిని బుధవారం మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి మాట్లాడారు.. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నల్గొండ నాగయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పోతురాజు ప్రతాప్, కళంచర్ల లింగయ్య, పిట్టల లింగయ్య, కొరివి అంజయ్య, బాదే రాములు, అల్లి వీరయ్య, వరికుప్పల వెంకులు, బొలక గణేష్ పాల్గొన్నారు.

నాగారం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాలకు చెందిన ఆదివాసీ ముద్దుబిడ్డ పూనెం లింగన్న ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో లింగన్న 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో నాయకులు బయ్యం లింగయ్య, వేముల గణేష్, వేర్పుల నేపాల్, బయ్యం భాస్కర్, సాగర్, రాములు, నాగరాజు, స్వామి, సంపేట యల్లయ్య, నరేష్, పవన్, ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ సాధన సర్వేపై హెచ్‌ఎంలకు అవగాహన


నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాములునాయక్

అర్వపల్లి : ప్రాథమిక స్థాయిలో 3వతరగతి విద్యార్థులకు నవంబర్‌లో జరిగే జాతీయ సాధన సర్వేకు పిల్లలను సంసిద్ధులు చేయాలని మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాదికి సంబంధించి జాతీయ సాధన సర్వే నవంబర్ నెలలో జరుగుతుందని, కాగా జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్‌పర్సన్లు మండల స్థాయిలో హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చిన్న వెంకట్‌రెడ్డి, పీఎస్ హెచ్‌ఎం జి.ఇందిర, రిసోర్సుపర్సన్‌లు వి.సైదులు, సీహెచ్.నాగరాజు, పి.మల్లయ్య, ఎస్.వెంకన్న, సీఆర్‌పీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

తుంగతుర్తి : ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి బోయిన లింగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలల పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2024–2025 విద్యా సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌ఏఎస్–2024 (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)కు అన్నీ పాఠశాలల్లోని 3వ తరగతి విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ చంద్రునాయక్, జీహెచ్‌ఎం ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, ఉషారాణి, ఆర్‌పీలు సీహెచ్.శ్రీరాములు, పి.కాంతారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలను పెంపొందించాలి

నూతనకల్ : విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి రాములునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయిలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివయ్య, వెంకటనారాయణ, శ్రీదేవి, రమేష్, సంతోష్, వీరస్వామి, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని సమాజ సేవకుడు, రచయిత డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, ఆట వస్తువులు, వివిధ క్లాత్ బ్యాగులను బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలకు అందించిన ఆట వస్తువులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు కె.సుదర్శన్‌రెడ్డి, జె.చంద్రశేఖర్, టి.అన్నపూర్ణచారి, ఎస్.దుర్గాప్రసాద్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, ఎస్.శిరీష, మల్లీశ్వరి, యాదమ్మ, రాఘవేంద్రస్వామి, రామనరసయ్య, రమేష్, శ్రీదేవి, కె.శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన ఏజెన్సీలు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కుంచమర్తి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించి గ్రామంలో చేపడుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

కార్యదర్శికి సన్మానం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సతీష్‌ను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెమ్మాది నగేష్, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నాగరాజు, అంజయ్య, సిబ్బంది శ్యామ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

న్యాయవాది పాండురంగా మృతికి సంతాపం

చివ్వెంల : సూర్యాపేట బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది సీహెచ్ పాండురంగా అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల సూర్యాపేట పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. వారిలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లయ్య, న్యాయవాదులు వీవీరావు, వేణుగోపాల్‌రావు, నల్లకుంట్ల అయోధ్య, డాక శ్రీనివాస్ నాయుడు, కాకి రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లుయాదవ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌గా రమేష్‌గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న రమేష్‌గౌడ్

తుంగతుర్తి : సూర్యాపేట జిల్లా జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌గా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన గోపగాని రమేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారసత్వ పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎన్సీఆర్సీ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్.నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

హామీలను అమలు చేయాలి


ఎన్నికైన నూతన మండల కమిటీ సభ్యులు

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ యూనియన్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా ఏ.సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా బి.మంజుల, ఉపాధ్యక్షులుగా ఎస్.విజయలక్ష్మి, మాధవి, శ్రీవాణి, సహాయ కార్యదర్శులుగా టి.అరుణ, నిర్మల, కోశాధికారిగా ఎస్‌కే షాహెదా, గౌరవ అధ్యక్షురాలిగా గుర్వోజు రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతామహాలక్ష్మి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, న్యాయవాది జి.రాజారాం, కోట రామస్వామి, రమాదేవి, ఆయా గ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.